కథ 2010

9



# రణనినాదం అను 7 ఎపిసోడ్ల కథ

పెద్దింటి అశోక్‌కుమార్

నగరంలోని ఓ ఖరీదైన ఏసీ హోటల్‌లో ఖద్దరు టోపి దర్శకుడు పచ్చచొక్కా నిర్మాతల మధ్య ఓరోజు ఇలా సంభాషణ జరిగింది.

"దర్శక మహాశయా...ప్రజలంతా కొత్తదనం కోరుకుంటున్నారు. కొత్తతరం కోసం ఎదురు చూస్తున్నారు. మనను అందరూ మరిచిపోయినట్టున్నారు. మీ మేధస్సుకు పదునుపెట్టి ఒక తిరుగులేని, ఎదురులేని విపరీతంగా రేటింగ్ పెరిగే ఒక కథ చెప్పండి," అన్నాడు నిర్మాత.

దర్శకుడు నవ్వి, "అయ్యా! ఒక సస్పెన్స్ కం క్రైం థ్రిల్లింగ్ కథ రెడీగా ఉంది. వింటారా," అంటూ లాప్‌టాప్ తెరిచాడు.

నిర్మాత కథ విని ఎగిరి గంతేశాడు. "మటాష్.... ఈ దెబ్బతో మిగతా సీరియళ్లన్నీ మటాష్. ఎవరినోట విన్నా, ఏ ఇంట్లో చూసినా ఈ కథనే వినిపిస్తుంది. ఎన్నేండ్లయినా సాగదీద్దాం. మనకు తెలిసిన, మనం చూసిన మలుపులు, విరుపులు అన్నీ పెట్టేద్దాం," అన్నాడు నిర్మాత.

షూటింగ్ మొదలయింది. సీరియల్ ఏడు ఎపిసోడ్లు పూర్తయింది. ఈ విషయం స్పాన్సర్లకు తెలిసింది. నిర్మాత దర్శకుల ప్రతిభ మీద అపారమైన నమ్మకం ఉన్నవాళ్లు, పలుకు మీద గౌరవం ఉన్నవాళ్లు, పోటీపడి ఒప్పుకున్నారు. సీరియల్‌ను తొందరగా మొదలుపెట్టమని మొరపెట్టుకున్నారు.

ఒకవైపు షూటింగ్ జరుగుతుంది. ఒకవైపు సీరియల్ మొదలయింది. కథలో మలుపులు చెబుతూ పేపర్లలో టీవీల్లో ప్రకటనలు ఇవ్వడం చేత జనమంతా ఊపిరి బిగబట్టి ఎదురుచూస్తున్నారు.

*ఎపిసోడ్-1*

కన్నీళ్లు పెట్టించే టైటిల్‌సాంగ్

నాలుగే పాత్రలు. మిగతావన్నీ గెస్ట్‌రోల్స్. లో బడ్జెట్.

కోట్ల మంది చూస్తున్నారు. రేటింగ్ చూసి యాజమాన్యం నోరు తెరిచింది.

మొదలే పెండ్లి చూపుల సీన్. పల్లెటూరి అమ్మాయి. పట్నవాసపు అబ్బాయి. అమ్మాయి తలవంచుకొని కూర్చుంది. అమ్మాయి తండ్రి భయంభయంగా దిక్కులు చూస్తున్నాడు. తల్లి వంటింట్లో హడావుడిగా ఉంది. అబ్బాయి లాల్చీపైజామాలో వున్నాడు. అబ్బాయి తల్లి అమ్మాయిని, ఇల్లును మార్చి మార్చి చూస్తుంది. (మనసులో) 'ఇల్లు బాగుంది. అమ్మాయి ఒంటిమీది నగలు బాగున్నాయి. కనిపిస్తున్న ఆస్తే ఇంత ఉంటే కనిపించనిది మరెంత ఉందో... ఎలాగైనా ఈ సంబంధం కుదుర్చుకోవాలి.'

ఈ మాటలు ప్రేక్షకులు వింటున్నారు. బీపి, షుగర్‌లు పెంచుకుంటున్నారు.

వెంటనే స్వల్ప విరామం.

స్పాన్సర్లు వస్తువులతో ప్రత్యక్షం.

పొగతాగడం ఆరోగ్యానికి హానికరం. బీడీలు మానండి. సిగరెట్లు తాగండి. బీడీ కట్టలపై ఆడుతున్న పుర్రెబొమ్మ.

సీరియల్ స్టార్ట్. అమ్మాయి సిగ్గుతో కందిపోయే బుగ్గలతో తలపైకెత్తింది. అబ్బాయి సల్మాన్‌ఖాన్. మనసులోనే పొంగిపోయింది. ఇద్దరి చూపులు కలుసు

కున్నాయి. ముడివడి విడివడలేక విడివడ్డాయి. దర్శకుడు ఆ సీన్‌ను అద్భుతంగా చిత్రీకరించాడు. అమ్మాయి గిలగిలా కొట్టుకుంటూ తలదించుకుంది. అబ్బాయి (మనసులో) 'వెర్రి మాలోకంలా ఉంది. నగలన్నీ ఒర్జినల్‌లాగే ఉన్నాయి. ఒడ్డాణం అమ్మితే పాత బాకీలు ఫట్. మెడలో గొలుసు తీస్తే ఫ్రెండ్స్‌కు మంచి పార్టీ. ఈ ఇల్లు నాదే ఆ ఒళ్లు నాదే... థాంక్ గాడ్... ఇల్లు లేనోనికి ఓ ఇల్లు చూపించావు.'

పాత్రలకు కాకుండా ప్రేక్షకులకు మాత్రమే వినిపించే మాటలు.

అబ్బాయి తండ్రి దిక్కులు చూస్తున్నాడు. చూస్తూ చూస్తూ (మనసులో) 'ఈ వెధవను ఒప్పించాలి. పెళ్లయ్యేవరకైనా వెధవ పనులు మాన్పించాలి. స్థితిమంతుల్లా ఉన్నారు. ఒప్పుకుంటారో లేదో. ఒప్పుకుంటే మాత్రం నా సామిరంగా...చివరి రక్తం బొట్టు పీల్చుకునే వరకు ఎంజాయ్ చెయ్యచ్చు. నాకున్నది కిరాయి ఇల్లే కదా! మకాం ఇక్కడికే మారుస్తా,' అనుకున్నాడు.

మళ్లీ స్వల్ప విరామం.

స్పాన్సర్లు రెడీ. కత్తుల్లాంటి కలాలతో ఈటెల్లాంటి మాటలు. వ్యభిచారం నేరం. అన్‌వాంటెడ్ పిల్స్. నిరోధ్ వాడండి. ఎయిడ్స్‌ను నిరోధించండి.

సీరియల్ స్టార్ట్. ఒప్పందాలు జరుగుతున్నాయి. కట్నకానుకలు మాట్లాడుకుంటున్నారు.

''ఒక్కతే బిడ్డ... అంతో ఇంతో ఉన్న సంసారమే. ఆస్తులన్నీ అమ్మాయి పేరు మీదనే ఉన్నయి. నా ఆస్తంతా తనదేకదా...'' అమ్మాయి తండ్రి అమాయకంగా.

పైకి అబ్బాయి నవ్వుతున్నాడు. (మనసులో) 'అంతా తెలుసు. తెలిసే వచ్చాం. తెలియనిదల్లా మా గురించి మీకే,' అనుకున్నాడు.

అమ్మాయి తల్లిదండ్రులు గుసగుసలాడుకుంటున్నారు. ఆ గుసగుసలు కూడా ప్రేక్షకులకు వినిపిస్తున్నాయి.

''మనమ్మాయి అదృష్టవంతురాలు. కిస్మత్ మంచిగుంది. మంచి సంబంధం దొరికింది,'' అని తల్లి.

''అంతా దేవుని దయ,'' తండ్రి.

ప్రేక్షకులు, 'వద్దు... వద్దు వాడు మంచివాడు కాదు. వట్టి శాడిస్టు. మొన్ననే వీడిని భరించలేక మొదటి భార్య విడాకులిచ్చింది,' అని మొత్తుకుంటూనే వున్నారు. వారి ప్రమేయం లేకుండా పెండ్లి జరిగింది.

అత్త, మామ, భర్త, ఆమె ఇంట్లోనే తిష్ట వేశారు. ప్రేక్షకుల మాటలు దర్శక నిర్మాతలు వింటున్నారు. తీవ్రమైన ఉత్కంఠ. విపరీతమైన రేటింగ్. దర్శకుడు హ్యాపీ. నిర్మాత హ్యాపీ. స్పాన్సర్లు మరీ హ్యాపీ.

***ఎపిసోడ్-2***

అత్త వేధింపులు. మామ సూటిపోటి మాటలు. ఇల్లు ఇల్లులా లేదు. ఇంట్లో ఆమె ఆనవాళ్లు లేవు. ఆమె ఉనికిని చెప్పే ఏ వస్తువు ఇంట్లో లేదు.

అమ్మాయి కాఫీ కప్పుతో బెడ్‌రూంలోకి అడుగు పెట్టింది. భర్త గురక తీస్తున్నాడు. అతడిని సున్నితంగా నిద్రలేపి, ''చాయ్,'' అంది అమ్మాయి.

అబ్బాయి విసుగ్గా చూస్తూ, ''దరిద్రం మొహం నువ్వూనూ... టీ అనరాదు. నీకు నాగరికత లేదు. భాష కూడా రాదు,'' అన్నాడు.

అమ్మాయి నవ్వులు పెదవుల మీదనే చిదిమివేయబడ్డాయి. క్లోజప్‌లో ఆమె మొహం రెండు మూడు సార్లు ముందుకు వెనక్కు. రోటీన్‌గా స్మాల్ బ్రేక్. బ్రేక్ తర్వాత...

"తీసుకో... నువ్వే కదా... బెడ్ మీదికి తెమ్మన్నవు," అమ్మాయి.

''చూశారా... చూశారా... ఇన్నేండ్ల కాపురంలో ఎప్పుడైనా మిమ్మల్ని అలా ఏకవచనంతో సంబోధించానా... భర్తంటే కించిత్ గౌరవం లేదు. డబ్బున్న పిల్లని బాగా గర్వం. మనమంటే చిన్నచూపు,'' అప్పుడే అక్కడికి వచ్చిన అత్తగారు భర్తతో ఫిర్యాదు చేసింది.

ప్రేక్షకులు చాలా హర్ట్. అయ్యో పాపం ఆమెకు గర్వమెక్కడిదని సింపతి. ఆమె కష్టాలను చూసి కన్నీళ్లు.

పిల్లిలాంటి మామగారు పులిలా ముందుకొచ్చాడు. "అవునే... మనవాడు వట్టి చవట గాబట్టే గదా. ఇది ఇలా రెచ్చిపోతుంది,'' అన్నాడు భార్యతో.

''నేనేం చవటనుగాను తెలుసా...'' అన్నాడు కొడుకు.

ప్రేక్షకులకు మాత్రమే కనిపించే విధంగా తండ్రి సైగ చేశాడు. తల్లి క్రూరంగా నవ్వింది. కొడుకు చేతిలోని కప్పు పైకి లేచింది.

''అయ్యో... వద్దు... వద్దు... అన్యాయం... అక్రమం...'' ప్రేక్షకుల గగ్గోలు.

వారిని మరింత క్షోభకు గురిచేస్తూ అమ్మాయి అమాయకంగా, "చాయ్ మంచిగుందా... నేనే చేసిన," అన్నది.

''నీ మొహంలా ఉంది,'' అంటూ ఆమె పైకి విసిరికొట్టాడు.

అమ్మాయి మొహం నిండా వేడి వేడి టీ. కళ్లల్లో నీళ్లు. ముగ్గురూ నవ్వుతున్నారు. మళ్లీ బ్రేక్. రీ ఓపెన్‌లో లాంగ్ షాట్. బట్టల గుట్టల ముందు అమ్మాయి. ఆయాస పడుతూ బట్టలు ఉతుకుతుంది. అత్తామామ భర్త ముగ్గురూ ఏదో కుట్ర చేస్తున్నారు. ఈసారి మాటలు ప్రేక్షకులకు కూడా వినిపించడం లేదు. భర్త మొహం మాత్రం విషపు నవ్వుతో క్లోజ్డ్ షాట్.

ఏమవుతుందోనని ప్రేక్షకుల హైటెన్షన్. హై రేటింగ్. దర్శకుడు కుషీ. నిర్మాత కుషీకుషీ. స్పాన్సర్స్ మరింతగా కుషీ.

***ఎపిసోడ్-3***

అత్తా, మామ, భర్త దీర్ఘాలోచనలో ఉన్నారు. అమ్మాయి స్టోర్‌రూంలో ఒక మూలన ఉంది. చుట్టూ దుమ్ముపట్టిన పాత సామాన్లు. మొహం అతి దీనంగా ఉంది. పుట్టినింటి నుండి తనతో తెచ్చుకున్న చెక్క బొమ్మలను ఏరుకుంటుంది. ఉమ్మితో తడిచేసి వాటిని తుడుచుకుంటుంది. ఇత్తడి తాంబూలం, తవుకు, మాణిక్యాలు, చెంబు ఇంకా వస్తువులు దుమ్ము కొట్టుకుని పడి ఉన్నాయి.

"చంపేస్తే పోలా... ఆస్తంతా మనకే అవుతుంది," మామ అంటున్నాడు.

"అయ్యో... అయ్యో... చంపేస్తారట పాపం. వద్దు వద్దు," ప్రేక్షకులు.

అత్త నవ్వింది. కొడుకు చెవిలో ఏదో చెప్పింది. కొడుకు నవ్వుతూ తలూపాడు.

ప్రేక్షకులకు టెన్షన్. ఏం చెప్పింది...? ఏం జరగ బోతుంది...? ఆమె బతకాలి. గెలవాలి. సాధించాలి. ఈ మోసం చేసే మనషులతో ఆమె ఉండకూడదు.

రొటీన్‌గా షార్ట్ బ్రేక్. ఊపిరి బిగపట్టిన ప్రేక్షకుల ఉశ్చ్వాస నిశ్వాసల్లో నాగుపాము బుసలు.

కొడుకు కాఫీ కప్పుతో స్టోర్‌రూంలోకి నడిచాడు. క్లోజప్‌లో కాఫీ పచ్చగా మెరుస్తుంది. అతడిని చూసి ఆమె ఉలిక్కిపడ్డది. కింద పడ్డ మొక్కజొన్న గింజల్ని ఏరుతున్నట్టు నటించింది.

ఆమె మనసు తెలిసినవాడిలా బొమ్మల్ని బట్టతో తుడిచాడు. వాటిని ముద్దాడాడు. కాఫీ కప్పు ఆమె చేతి కిచ్చాడు. ఆమె నమ్మలేకపోతుంది. చెంపల్ని నిమిరి ముక్కును పిండి వీపును తడిమి కాఫీ తాగించాడు.

ప్రేక్షకులు టెన్షన్ తట్టుకోలేకపోతున్నారు. 'తాగొద్దు...తాగొద్దు,' అని అరుస్తున్నారు. ఆమెకు విని పించడం లేదు. తాగడం పూర్తికానే లేదు. వెక్కిళ్లు మొదలయ్యాయి. అదను చూసి బ్రేక్.

కోట్ల కళ్లు తెరకు అలాగే అత్తుక్కుపోయాయి. రీ ఓపెన్‌లో వంటింట్లో హడావుడి. వెక్కిళ్లతో ఆయాస పడుతున్న భార్యకు నీళ్లను అందిస్తున్నాడు భర్త. అత్తా మామలు గాబరాపడిపోతున్నారు. కొద్దిసేపట్లో ఆమె తేరుకుంది.

"నువ్వు నా బంగారు బాతువు. దురాశకు పోయి ఒకేసారి చంపుకోము గదా," ప్రేక్షకులకు చెప్పింది అత్త. చావు తప్పినందుకు అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సీన్ కట్ చేస్తే బెడ్‌రూంలో.

భార్యాభర్తలు ఇద్దరే ఉన్నారు. భర్త గారాలు పోతున్నాడు. భార్య అన్నీ మరిచి మురిపాలు పంచు తుంది. అతడు ఆమెను కీర్తిస్తున్నాడు. భుజాల మీద తిప్పుతున్నాడు. ఏమిటా అని ప్రేక్షకులు అయోమయం. అతడి చేతిలో పెన్నూ పేపర్.

"నీది నాది కాదా... నా బతుకు నీది కాదా... ఇద్దరం ఒక్కటి కాదా... ఆ ఎర్ర చెలుక నేలలు ఏం చేస్తున్నాయి. అమ్మి పెద్ద ఫ్యాక్టరీ పెడదాం. చిన్న సంతకం పెట్టు చాలు. పెద్ద కంపెనీకి నిన్ను ఓనర్‌ను చేస్తాను," అతడు అంటున్నాడు.

'ఓహో, ఇదా నీ ప్లాన్...' అనుకున్నారు ప్రేక్షకులు.

అమ్మాయి పాత్ర కదిలిపోయింది. కరిగిపో యింది. పెన్ను కాగితం చేతుల్లోకి తీసుకుంది.

ప్రేక్షకుల్లో మళ్లీ ఆందోళన. 'వద్దు...మోసం...నీ సంపదను ఆక్రమిస్తున్నాడు. మాటలు నమ్మకు. మోస పోకు,' అని. తీగను సాగదీసి సాగదీసి చిన్నగా మీటి నట్టు తరువాయి భాగం రేపు.

జనంలో చర్చలు. కోపం, సానుభూతి. దిగం తాలు వినబడేలా అరుస్తున్నారు. పాత్రలకు వినిపిం చడం లేదు. అవి ప్రాణంతో ఉండవు కదా. రేటింగ్‌లో కొలిచే డైరెక్టర్, నిర్మాత, స్పాన్సర్లు మాత్రం వింటున్నారు.

పాత్రధారులు కూడా ప్రేక్షకులను ఓ కంట కని పెడుతున్నారు. పాచిక పారుతున్నందుకు బహుత్ కుష్. ప్రేక్షకులు ఏం ఆలోచిస్తున్నారో తెలుసుకుని దానికి మరింత విరుద్ధంగా కథను నడపాలనుకుంటున్నారు.

అవసరమైనప్పుడు మలుపు. ఆపాలనుకున్న ప్పుడే ఫుల్‌స్టాప్. కోర్టులో బంతి. సాగినంతకాలం సాగ దీయాలనుకున్నారు.

***ఎపిసోడ్-4***

ఆమె పెన్ను తీసుకుంది. పేపర్ తీసుకుంది. మెల్లిగా తలెత్తి, "నా నగలన్నీ ఏం చేసినవు. నేను చూడు ఆకురాలిన చెట్టు లెక్క ఎట్లున్ననో... ఇప్పుడు నా

భూముల్ని కూడా అమ్ముతానంటున్నవు. రేపు మన పిల్లలు ఎట్ల బతుకుతరు,'' అన్నది.

"ఓస్ అదెంత పని. వచ్చే లాభాలతో ముందుగా నీకే నగలు కొనిపెడతాను సరేనా,'' అన్నాడు. హఠాత్తుగా ఆమె కళ్లు గోగుపూలు. మొహం కందగడ్డ. కాళ్లు చేతులు కోపంతో బిగుసుకుపోయాయి. నరనరాన రక్తం ప్రవాహంలా పొంగుతుంది.

ప్రేక్షకుల్లో ఉత్కంఠ. ఆమె పేపర్‌ను పరపరా చింపి అతని మొహాన విసిరి కొట్టింది. పెన్నును రెండు ముక్కలు చేసింది. చూపుడువేలితో చూపిస్తూ, "పో... బయటకు,'' అని గర్జించింది.

ప్రేక్షకులు బహుత్ కుష్... పాత్రతో మమేకమై వాళ్లు కూడా అరిచారు. వాళ్లను వెళ్లిపొమ్మని గొంతెత్తి నినాదాలిచ్చారు. ముగ్గురూ అప్పటికప్పుడు తోక ముడిచారు. పనిలోపనిగా స్మాల్ బ్రేక్.

ప్రేక్షకులు అమితానందం. వాళ్లకు తగిన బుద్ధి చెప్పిందని తృప్తి. వాళ్లేం చేస్తారోనని కొందరికి భయం. ఆమె తిరుగబడాలని కొందరి సూచన. ఆవేశవంతులు కొందరు ఆమెలోకి పరకాయ ప్రవేశం చేయాలని చూశారు. ఇది ముందే పసిగట్టిన దర్శక నిర్మాతలు అలా జరుగకుండా కాపలా పెట్టి కట్టుదిట్టం చేసారు. సేమ్ షాట్‌లో రీ ఓపెన్.

"ఎక్కడికే... వాన్ని వెళ్లి పొమ్మంటున్నావు...'' బయట నుంచి అత్త పరుగెత్తు కచ్చింది.

"ఇది నా యిల్లు. నా స్వంతం. మీరు ఒక్కక్షణం ఇక్కడ ఉండడానికి వీల్లేదు. నా ఇంట్లకచ్చి నన్నే పరాయిదాన్ని చేసింట్రు,'' అమ్మాయి గట్టిగా అరిచింది.

"అమ్మా... నువ్వు పొమ్మంటే పోవడానికి రమ్మంటే రావడానికి నీ ఇంట్లో పనిమనిషులను కున్నావా... నీదంటూ ఏమీ లేదిప్పుడు. అంతా మాదైపోయిందిగా,'' విషపునవ్వుతో మామ పరుగెత్తుకొచ్చాడు.

ముగ్గురికీ వాగ్వివాదం. ముగ్గురు ఆమె మీద పడి కొడుతున్నారు. ఆమె ఓడిపోతుంది. ప్రేక్షకులు గొంతు విప్పి అరుస్తున్నారు. ఆమె గెలుస్తుంది. ప్రేక్షకులు ఆనందిస్తున్నారు. పాత్ర కోట్లమంది ప్రేక్షకులదయింది. ఇప్పుడొక స్మాల్ బ్రేక్.

తిరిగి స్క్రీన్ మీదికి వస్తే ఆమెతో బలవంతంగా సంతకం పెట్టించాలని చూశారు. ఆమె వినలేదు. పెనుగులాడింది. గదిలో బంధించి బలవంతంగా సంతకం పెట్టించారు. ఇది అమానుషం అని కొందరు నినదించారు. ఆమె కోసం పోరాటం మొదలుపెట్టారు.

ఆమె పేరున అభిమాన సంఘాలు ఏర్పడ్డాయి. ఒక పాత్ర ప్రేక్షకులలో ఇంత అలజడిని సృష్టించినందుకు దర్శక నిర్మాతలు పొంగిపోయారు. అనుకున్న దానికంటే ఎక్కువ లాభాలు సంపాదించి పెడుతున్నందుకు స్పాన్సర్లు డబ్బు సంచులతో దర్శక, నిర్మాతల ముందు సాగిలబడ్డారు.

ప్రేక్షకులు అశ్రునయనాలతో రేపటి కోసం ఎదురుచూస్తున్నారు.

***ఎపిసోడ్-5 & 6***

నాలుగు ఎపిసోడ్‌లతో ప్రేక్షకులను గుప్పిట్లోకి తీసుకున్నాడు డైరెక్టర్. కావాలనుకున్నప్పుడు ఏడిపిస్తున్నాడు. కోపం వచ్చినప్పుడు గుండెల్ని పిండేస్తున్నాడు. అప్పుడప్పుడు నవ్విస్తున్నాడు. అప్పటికప్పుడు బేలను చేస్తున్నాడు. ఒక్కొక్కప్పుడు ముగ్ధను చేస్తున్నాడు. ఏమీ తోచనప్పుడు ఆమెలో అంతులేని చైతన్యాన్ని నింపి సమర శంఖం పూరిస్తున్నాడు. గత గాయాలను గేయాలుగా, వర్తమానాన్ని ఆర్తనాదాలుగా, భవితను బంగారు కవితగా వినిపిస్తున్నాడు.

పనిలో పనిగా పాత్రధారులు జనంలోకి వచ్చి పల్స్‌రేటును పట్టిచూస్తున్నారు. ఎక్కడ నటనను ఎలా పండించాలో నేర్చుకుంటున్నారు. ఒక రకంగా దొరికి నట్టె దొరికి ప్రేక్షకులతో దొంగాట ఆడుతున్నారు. ఊహించని మలుపులతో ఆమెను మరింత తిప్పలు పెడుతున్నారు.

ప్రేక్షకులు పాత్రతో మమేకమై ఆడుతున్నారు. పాడుతున్నారు. ఏడుస్తున్నారు. నవ్వుతున్నారు. దర్శకుడికి ప్రేక్షకులకు మధ్య ఇనుపతెరలతో బహుముఖాలుగా ఆమె పాత్ర విస్తరిస్తుంది. గాయాలతో గేయాలతో కన్నీళ్లతో జనాన్ని కదిలిస్తుంది.

అంతటా ఉత్కంఠ రేగుతుంది. తీవ్రత తట్టుకోలేక ప్రేక్షకులు కొట్టుకుంటున్నారు. పాత్ర మీద అఖండ సానుభూతితో ఆత్మత్యాగం చేసుకుంటున్నారు. ధైర్యవంతులైన యువకులు కొందరు ఆయుధాలు పట్టుకుని ఆమెను రక్షించడానికి బయలుదేరారు.

స్పాన్సర్లకు బోలెడు పబ్లిసిటీ. దర్శకుడికి లెక్కలేని ఆఫర్లు. నిర్మాతకు డబ్బులే డబ్బులు. పాత్రధారులకు అవార్డులు, రివార్డులు. సీరియల్ ఎలా కొనసాగించాలో ఏ మలుపులు తిప్పాలో తర్జనభర్జనలు పడుతున్నారు.

దర్శకుడు, నిర్మాత బహుజాగూకరతతో వున్నారు. ఎప్పటికప్పుడు ప్రేక్షకులను గమనిస్తున్నారు. ఆమె

కోసం మౌనంగా ఏడవడం తప్ప ప్రశ్నించడం నిషేధించారు. అనుమానం వచ్చిన ప్రతిచోట నిఘాను పెంచారు.

*ఎపిసోడ్-7*

గదిలో ఆమె బానిసలా బతుకుతుంది. వాళ్లు విదిలించే పిడికెడు మెతుకుల కోసం ఆమె ఆశగా చూస్తుంది. ప్రేక్షకులు ఆక్రోశిస్తున్నారు. దర్శకుడు కోరుకున్న దానికంటే ఎక్కువగా ఆందోళన పడుతున్నారు. ఆ విషయం నిర్మాతతో చెప్పి రెమ్యురేషన్ పెంచుకున్నాడు దర్శకుడు.

"నాకు విముక్తి కావాలి," ఆమె గర్జిస్తుంది.

"ఇస్తే పోలా..." కొడుకు అన్నాడు.

"నీ మొహం... ఇచ్చి ఏం చేస్తావు... ఇస్తే మాత్రం ఊరుకుంటుందా... కాజేసిన సొమ్మంతా రాబట్టదూ... ఇలా పడి ఉండాల్సిందే," అన్నది అత్త.

కొడుకు బుర్ర గోక్కుంటూ, "అవును నిజమే," అన్నాడు.

ఆమె అన్యాయమని ఆక్రోశిస్తుంది. వాళ్ల జులుంను ప్రశ్నిస్తుంది. అలవాటుగా బ్రేక్ పడింది. దర్శక నిర్మాతలు కథను మరో మలుపు తిప్పారు.

తిరిగి ఓపెన్‌లో ఇంట్లో ఐదుగురు పెద్దలున్నారు. ఆమెకు న్యాయం చేస్తామంటున్నారు.

అత్తగారు పెద్దలను ఆహ్వానించింది. మామగారు మర్యాద చేశారు. భర్త పెద్దలను ఇల్లంతా తిప్పి చూపించాడు. అతి వినయం కురిపించారు. అమాయకులుగా నటించారు.

ఆమె కళ్లల్లోంచి రక్తం ఒలుకుతుంది. మాటల్లో ఆవేశం పొంగుతుంది. పెద్దమనుషులు తమతమ బాధలను వేదనలను చెప్పుకొమ్మన్నారు. తర్జనభర్జనలు. వాడి వేడి చర్చలు. పెద్దలు నిర్ణయం చెప్పేలోపు చిన్న బ్రేక్.

రీ ఓపెన్‌లో స్క్రీన్ మీద ఇల్లంతా మెరిసిపోతుంది. ప్రేక్షకులంతా ఎంతో ఆశతో పెద్దల నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు. పెద్దలు వక్కపొడి నములుతూ తీరిగ్గా నిర్ణయం చెప్పారు.

'గడసరి అబ్బాయికి అమాయకపు అమ్మాయికి జరిగిన పెళ్లి ఇది. జాగ్రత్తగా తీర్పు చెప్పాలి,' జనానికి మాత్రమే వినిపించేటట్టు ఒక పెద్దమనిషి అంతరాత్మ.

"ఇల్లు బాగుంది. మంచి భర్త. కన్నకూతురులా చూసుకునే అత్తామామలు. ఇంకేం కావాలి. కాపురం కూల్చుకోకు. నీకు అన్యాయం జరిగిన మాట నిజమే. ఇక ముందు అలా జరగకుండా ఒప్పందం రాస్తాం," ఓ పెద్దమనిషి మాట.

చూస్తున్న కోట్ల జనం గుండెలు మండుతున్నాయి. ఆవేశం రగులుతుంది. అసలు రంగు అది కాదని అరుస్తున్నారు. ఎన్నో ఒప్పందాలు నీటి మూటలయ్యాయి. విడాకులే మార్గమని ఆక్రోశిస్తున్నారు. వాళ్ల మాటలు విద్యుత్ అయస్కాంత తరంగాలుగా మారలేకపోతున్నాయి. ఆవేశం ఆవిరై కాళ్లు భూమిలోకి కుంగిపోతున్నాయి.

స్పాన్సర్స్‌కి సంతోషం. డైరెక్టర్‌కి పేరు ప్రతిష్టలు. నిర్మాతకి లాభం. పాత్రను అడ్డంగా పెట్టుకుని ప్రజలను ఆడిస్తున్నారు. విడాకులిస్తే సీరియల్ ముందుకు సాగదని పీటముడి వేశారు.

*ఎపిసోడ్-8*

హఠాత్తుగా పాత్ర మాయమయింది. అంతా అయోమయం. స్క్రీన్ కదలడం లేదు. అందరిలో ఉత్కంఠత. తొలకరి జల్లుకు విత్తనం పురుడు పోసుకున్నట్టు... అంతటా విస్తరించిన గడ్డిపరకల్లా జనం. సముద్రంలో నీరు చుక్కలు చుక్కలుగా గడ్డకట్టి నిలిచినట్టు.

స్క్రీన్ మీద మాయమైన పాత్ర జనంలో తేలింది. డైరెక్టర్‌కి జనంకి మధ్య వున్న తెర తొలగిపోయింది. ఆమెను ఆడించి ఆడుకున్న దర్శకుడు, నిర్మాత, పాత్రధారులు, స్పాన్సర్లు ఇప్పుడు జనంకు ఎదురుగా స్పష్టంగా కనిపిస్తున్నారు.

కోట్ల జనం గొంతులో ఇప్పుడు రణనినాదమై ఆమె ఊరేగుతుంది. జై తెలంగాణ నినాదం మారుమోగుతుంది.

*నవ్య వీక్లీ, 29 సెప్టెంబర్ 2010*

